క్లుప్తంగా

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

కాకినాడ రూరల్: ‘పల్లె పండుగ’ కార్యక్రమంలో భాగంగా కాకినాడ రూరల్ మండలంలో రెండో రోజు నాలుగు గ్రామాలలో ఎమ్మెల్యే పంతం నానాజీ బుధవారం పర్యటించారు. పెనుమర్తి, పండూరు, పి.వెంకటాపురం, సూర్యారావు గ్రామాలలో పర్యటించి ఉపాధి హామీ నిధులతో చేపట్టనున్న రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. నియోజకవర్గంలో సుమారు రూ.12.63 కోట్లతో రోడ్ల నిర్మాణం చేపట్టనున్నట్టు ఎమ్మెల్యే నానాజీ తెలిపారు. త్వరలో రోడ్ల నిర్మాణాలు పూర్తి చేస్తామన్నారు. చాలా గ్రామాలలో పుంత, లింక్ రోడ్లు అడిగారని, వాటికి నిధులు మంజూరు చేస్తామన్నారు.

అధిక పన్ను వసూలు తగదు

బోట్‌క్లబ్: రాష్ట్రం అప్పుల కోసం అనుమతి ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం విధించిన షరతులు రద్దు చేయాలని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆస్తి మారకం జరిగినప్పుడు కొనుగోలు దారుడు నుంచి వసూలు చేసినట్టుగా మూలధనపు విలువ మీద ఇంటి పన్ను వసూలు చేయడం సహేతుకం కాదన్నారు. ప్రతీ సంవత్సరం రిజిస్ట్రార్ రేట్ల ప్రకారం వసూలు చేస్తున్న ఇంటి పన్నులు తీవ్ర భారమయ్యాయన్నారు. ఇంటి పన్ను లోబడి ఉన్న గ్రంథాలయ పన్నును అదనంగా 8 శాతం వసూలు చేయడం తగదన్నారు. తాము అధికారంలోకి వస్తే ఆస్తి పన్ను పెంపు నియంత్రణ చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. సచివాలయం పరిధిలో మున్సిపల్ గ్రంథాలయం రీడింగ్ రూం లేని చోట గ్రంథాలయ సెస్‌ను వసూలు చేయడం నిలిపివేయాలన్నారు.

శస్త్రచికిత్సలో మత్తు వైద్యులు కీలకం



మత్తు వైద్యుడు చిట్లకిరణ్‌కు సత్కారం

బోట్‌క్లబ్: శస్త్ర చికిత్స, నొప్పి నివారణలో మత్తు వైద్యులు కీలక పాత్ర పోషిస్తారని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ అద్దాల సత్యనారాయణ అన్నారు. స్థానిక సత్య దంత వైద్యశాల్లో బుధవారం ప్రపంచ అనస్థీషియా దినోత్సవం సందర్భంగా మత్తు వైద్యులు చిట్ల కిరణ్‌ను అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ అనస్థీషియా పద్ధతులు రోగి ఆరోగ్యాన్ని మెరుగుపర్చడానికి ఉపయోగపడుతుందన్నారు. ఆధునిక వైద్యంలో మత్తు వైద్యుని ప్రాముఖ్యత ఎంతో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు నాగేంద్ర, సభ్యులు చైతన్య, సిరాజ్ పాల్గొన్నారు.

విలీన గ్రామాలకు ఎన్నికలు నిర్వహించాలి

కాకినాడ రూరల్: కాకినాడ కార్పొరేషన్‌లో విలీన ప్రతిపాదిత గ్రామాలను కలపక పోవడంతో ఆర్థిక సంఘం నిధులను కోల్పోతున్నాయని పౌర సంక్షేమ సంఘం కన్వీనరు దూసర్లపూడి రమణరాజు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే కాకినాడ రూరల్ మండలంలోని 8 గ్రామాలకు విలీన ప్రక్రియ ఎన్నికల నిర్వహణ చేపట్టాలని బుధవారం ఒక ప్రకటనలో ఆయన కోరారు. పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో త్వరలో బైక్ ర్యాలీ ద్వారా సీఎం, డిప్యూటీ సీఎంలను కలిసి రమణయ్యపేట, తూరంగి, ఇంద్రపాలెం, చీడిగ, వలసపాకల, వాకలపూడి తదితర గ్రామాలకు కేంద్ర ఆర్థిక సంఘ నిధులు రాకపోవడం వలన జరుగుతున్న నష్టాన్ని వివరిస్తామన్నారు.

సినిమాలు



ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్స్:
విశ్వం, వేట్టయాన్, దేవర, జనక అయితే గనక
దేవీ మల్టీప్లెక్స్ 4 స్క్రీన్స్:
దేవర, వేట్టయాన్, మా నాన్న సూపర్ హీరో

లక్ష్మి:	దేవర
సత్యగౌరి:	మా నాన్న సూపర్ హీరో
తిరుమల:	వేట్టయాన్
సీఅండ్‌సీ1:	జనక అయితే గనక
సీఅండ్‌సీ2:	శ్వాగ్
శ్రీప్రియ:	మార్టిన్
పద్మప్రియ:	దేవర
సూర్య (వాకలపూడి):	దేవర
సూర్య2:	విశ్వం

మోగిన నర్సింగ్ ఎన్నికల నగారా..!

- నిర్వహణకు మొదలైన సన్నాహాలు
- నామినేషన్ల దాఖలు
- ఈ నెల 23న ఎన్నికలు
- 516 మందికి గానూ 243 మందికే ఓటు హక్కు
- ఓటు హక్కుపై నెలకొన్న వివాదం

ముఖ్యమైన తేదీలు

16.10.2024 – నామినేషన్ల దాఖలు
17.10.2024 – నామినేషన్ల పరిశీలన
18.10.2024 – నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ
23.10.2024(ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు)– ఎన్నికలు
23.10.2024(సాయంత్రం 5.30 గంటల నుంచి)– కౌంటింగ్ ప్రారంభం

నర్సింగ్ ఎన్నికల నగారా మోగింది. మరో వారం రోజుల్లో ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. బుధవారం నామినేషన్ల ప్రక్రియతో ఎన్నికల హడావుడి ప్రారంభమైంది. అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో రెగ్యులర్ విధానంలో పని చేస్తున్న నర్సులు ఈ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు అర్హులు. అనేక వివాదాలకు నెలవుగా చర్చనీయాంశమవుతున్న నర్సింగ్ ఎన్నికలు సర్వత్రా ఉత్కంఠ రేపుతున్నాయి.



నామినేషన్లు దాఖలు చేసిన విజయలక్ష్మి ప్యానల్

కాకినాడ క్రైం: మూడేళ్లకు ఒక సారి జరగాల్సిన నర్సింగ్ ఎన్నికలు, ఆరేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత జరగనున్నాయి. 2018 తర్వాత మళ్లీ ఇవే ఎన్నికలు. సాధారణ ఎన్నికలు, కోవిడ్‌తో పాటు అంతర్గత కుమ్ములాటలు, అభిప్రాయ భేదాలు, వ్యక్తిగత వైషమ్యాలు, సమన్వయ లోపం జిల్లా నర్సింగ్ ఎన్నికల నిర్వహణకు ప్రతిబంధకంగా మారింది. ఈ నేపథ్యంలో ఆరేళ్ల విరామం తర్వాత జరుగుతున్న ఎన్నికలు కావడంతో ప్రాధాన్యత సంతరించుకుంది. కాకినాడలోని రేడియాలజీ సెమినార్ హాల్లో యావత్ ఎన్నికల ప్రక్రియ జరగనుంది.

ఓటు హక్కుపై వివాదం..

తాజా ఎన్నికలను ప్రభావితం చేయబోతోంది నిర్వివాదంగా ఓటు హక్కే. 516 మంది నర్సుల్లో కేవలం 243 మంది మాత్రమే ఓటు హక్కు పొందగలగడం వివాదమైంది. ఏడాది క్రితం విజయవాడలో నిర్వహించిన నర్సింగ్ అసోసియేషన్ సమావేశానికి హాజరైన రిప్రజంటేటివ్‌లలో ఒకరైన కాకినాడ జీజీహెచ్ నర్సు శ్యామల విజయకుమారి వ్యవహారశైలి కారణంగానే సభ్యత్వాలు పొందలేక, తాము ఓటు హక్కును కోల్పోయామని కాకినాడ జీజీహెచ్‌లో ఓటు హక్కు పొందలేక పోయిన 73 మంది నర్సుల్లో పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఏకగ్రీవంగా పగ్గాలు చేజిక్కించుకునేందుకు చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టాయని విమర్శించారు. ఆమె స్వార్థం వల్ల అర్హత ఉన్నా తాము ఓటు హక్కు పొందలేకపోయామని విమర్శిస్తున్నారు. అంతేకాక సభ్యత్వాల పేరుతో డబ్బులు వసూలు చేసి రసీదులు ఇవ్వకుండా, సభ్యత్వానికి ఆ డబ్బు చెల్లించకుండా దుర్వినియోగం జరిగిందనే విమర్శలు నర్సింగ్ వర్గాల్లో వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయంపై స్పందించిన శ్యామల అవి పసలేని విమర్శలని, అవాస్తవాలని ఖండించారు.



ఎన్నికల అధికారులతో మూడు ప్యానళ్ల నేతలు

23న ఎన్నికలు..

ప్రభుత్వ అనుమతితో కో–ఆపరేటివ్ సొసైటీ ఈ ఎన్నికలు నిర్వహిస్తోంది. రాష్ట్ర ఎన్నికల అధికారిగా కృష్ణా జిల్లా డీసీవో శ్రీనివాసరెడ్డి వ్యవహరిస్తుండగా ఉమ్మడి తూర్పుగోదావరి ఎన్నికల అధికారిగా జిల్లా కో–ఆపరేటివ్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ టి.నందన, సహకారిగా మరో అసిస్టెంట్ రిజిస్ట్రార్ శివ కామేశ్వరరావు వ్యవహరిస్తున్నారు.

3 ప్యానళ్లు...17 నామినేషన్లు...

నర్సింగ్ ఎన్నికల్లో మూడు ప్యానళ్లకు చెందిన 17 మంది బుధవారం తమ నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలో ప్రెసిడెంట్‌కు 3, వైస్ ప్రెసిడెంట్‌కు 2, కార్యదర్శికి 3, కోశాధికారికి 3, ఈసీ మెంబర్లకి 6 నామినేషన్లు వచ్చాయని నందన తెలిపారు.

కట్టుదిట్టమైన ఏర్పాట్లు



నర్సింగ్ ఎన్నికల నిర్వహణ అత్యంత సున్నిత అంశం. ఎక్కడా ఎటువంటి వివాదాలకు తావివ్వకుండా ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశాం. కాకినాడ నుంచి అత్యధిక ఓటర్లు ఉన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలు ప్రాంతాల నుంచి నర్సులు ఓటింగ్‌లో పాల్గొనబోతున్నారు. నామినేషన్ల ప్రక్రియ పూర్తయింది. ఎన్నికలకు సంబంధించిన ప్రతి చిన్న అంశాన్ని రాష్ట్ర విభాగానికి ఎప్పటికప్పుడు నివేదిస్తున్నాం. నలుగురు పోలింగ్ అధికారులు ఉంటారు. తెలుగు అక్షర మాల ప్రకారం పేర్లతో పోటీదారుల జాబితా రెడీ అవుతుంది. ఈసీ టీంకు ఒక బ్యాలెట్, ఈసీ మెంబర్లకు ఒక బ్యాలెట్ ఏర్పాటు చేస్తాము. పోలీసుల భద్రత నడుమ సీక్రెట్ ఓటింగ్ జరుగుతుంది. నిఘా కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే ఆలోచన ఉంది. ప్రశాంతంగా ఎన్నికలు పూర్తవడానికి నాయకుల సహకారం అవసరం.

– టి.నందన, జిల్లా కో–ఆపరేటివ్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ రిజిస్ట్రార్, నర్సింగ్ ఎన్నికల అధికారి.

20న సంగీత విభావరి



సినీ సంగీత విభావరి పోస్టర్ ఆవిష్కరిస్తున్న జానకీరామ చౌదరి

బోట్‌క్లబ్: కోన విజయ భాస్కరరావు మెమోరియల్ మ్యూజిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20న కాకినాడ దంటు కళాక్షేత్రంలో సాయంత్రం ఐదు గంటలకు సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ వ్యవస్థాపకులు బివిఎస్ ప్రభాకర్ తెలిపారు. స్థానిక దంటు కళాక్షేత్రంలో బుధవారం సంగీత విభావరి ఆహ్వాన పత్రికను సాహితీ స్రవంతి అధ్యక్షులు మార్ని జానకిరామ చౌదరి ఆవిష్కరించారు. సంస్థ గాయకులు తెలుగు, హిందీ, కన్నడ, తమిళ చిత్రాలలోని మధురగీతాలు ఆలపిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొని వర్ధమాన గాయనీ గాయకులను ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో నాదెళ్ల ప్రభుదాస్, కట్టా కృష్ణారావు, రఘుబాబు, తీపర్తి విజయ్ ,రమణ పాల్గొన్నారు.

మద్యం తాగి పట్టుబడితే జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసుల్లో ఒకరికి మూడు రోజుల జైలు, మరో ఆరుగురికి రెండు రోజుల చొప్పున జైలు, ఆరుగురికి జరిమానా విధిస్తూ కాకినాడ మూడో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.నరసింహారావు తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళితే కాకినాడ ట్రాఫిక్–1, 2 పోలీసు స్టేషన్ల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. బుధవారం పట్టుబడ్డ వారిని కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

లింగ నిర్ధారణకు పాల్పడితే కఠిన చర్యలు



సమీక్షలో మాట్లాడుతున్న ఆర్డీవో మల్లిబాబు

ఆర్డీవో మల్లిబాబు

కాకినాడ సిటీ: గర్భస్థ లింగ నిర్ధారణ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కాకినాడ ఆర్డీవో మల్లిబాబు అధికారులను ఆదేశించారు. ఆడ శిశువు పట్ల వివక్షతతో జరిగే భ్రూణ హత్యలను నివారించడంతో పాటు డివిజన్ స్థాయిలో లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని బుధవారం కాకినాడ రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో వైద్య ఆరోగ్యశాఖ, రెవెన్యూ, లీగల్, స్త్రీ శిశు సంక్షేమం, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గర్భస్థ పిండ ఆరోగ్య పర్యవేక్షణకు సంబంధించిన పరీక్షలను లింగ నిర్ధారణకు దుర్వినియోగం కాకుండా చూడాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించే అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. కాకినాడ డివిజన్ స్థాయిలో గుర్తింపు పొందిన 114 స్కానింగ్ సెంటర్లపై డెకాయ్ ఆపరేషన్లు, ఆకస్మిక తనిఖీలు సక్రమంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఏప్రిల్ నెల నుంచి ఇప్పటి వరకు 8 డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించి 146 స్కానింగ్ సెంటర్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించామన్నారు. పిండ లింగ నిర్ధారణ చట్టంపై గ్రామ స్థాయిలో వైద్య ఆరోగ్యం, స్త్రీ శిశు సంక్షేమ, స్వచ్ఛంద సంస్థలను సమన్వయం చేసుకుంటూ అవగాహన కార్యక్రమాల నిర్వహణకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆర్డీవో ఆదేశించారు.లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాంతాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సమావేశంలో డీఐవో డాక్టర్ కేవీ సుబ్బరాజు, గైనకాలజిస్ట్ డాక్టర్ పి సుజాత, రేడియాలజీ అసిస్టెంట్ డాక్టర్ జి రాము, పీడియాట్రిషన్ డాక్టర్ ఎం కీర్తిప్రియ, ఎన్‌జీవో వి అనిత, కారుణ్య ఛారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి కె సింహాద్రి, యూత్ వలంటీర్ ఆర్గనైజేషన్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

భవిత చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కరప: ప్రత్యేక అవసరాలు గల పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచటం ద్వారా వారిలోని లోపాలను గుర్తించి అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించడం జరుగుతోందని ఐఈఆర్‌టీలు కె.స్వాతి, ఎస్.మల్లేశ్వరి తెలిపారు. స్థానిక సక్కా సూర్యనారాయణ మూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలోని భవిత కేంద్రంలో బుధవారం డైస్లెక్సియాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్రంలోని చిన్నారులలో అభ్యసన లోపాలను గుర్తించి వారిపట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచి ఆ లోపాలను అధిగమించేలా రెమిడియల్ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం భవిత చిన్నారులతో కలిసి హైస్కూలు ఉపాధ్యాయులు పి.శ్రీనివాసరెడ్డి, ఎన్.ప్రసాద్‌కుమార్, జి.రాధాకృష్ణ, సీజీవీ డి.తనూజ, ఐఈఆర్‌టీలు డైస్లెక్సియా ర్యాలీ నిర్వహించారు.

ఆర్థిక సంఘం నిధుల విడుదలకు వినతి

కాకినాడ రూరల్: రమణయ్యపేట గ్రామానికి ఆర్థిక సంఘం, స్టాంప్ డ్యూటీ నిధులు విడుదల చేయించాలని ఎమ్మెల్యే పంతం నానాజీకి గ్రామ మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం వినతి పత్రం అందజేశారు. మండలంలోని 6 గ్రామాలకు 13 ఏళ్లుగా ఎన్నికలు జరగకపోవడంతో ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయని తెలిపారు. దీనిపై సంబంధిత శాఖల అధికారులు దృష్టికి తీసుకువెళ్లి నిధులు జమ అయ్యేలా చొరవ తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

గ్రామాలలో మద్యం జాతర



సర్పవరంలో పక్కపక్కనే ఏర్పాటు చేసిన మద్యం దుకాణాలు

- దుకాణాల వద్ద శిబిరాల ఏర్పాటు
- మందు బాబులను పిలిచి మరీ విక్రయాలు
- సర్పవరంలో పక్కపక్కనే రెండు దుకాణాలు ఏర్పాటు

కాకినాడ రూరల్: గ్రామాలలో మద్యం జాతర ప్రారంభమయ్యింది. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా మద్యం షాపులను లాటరీ విధానంలో కేటాయించడంతో వాటిని పొందిన వారు జాతరను తలపించేలా అమ్మకాల కోసం మద్యాన్ని బజారున పెట్టేశారు. కాకినాడ రూరల్ మండలంలో బుధవారం కొత్త మద్యం షాపులు ప్రారంభమయ్యాయి. జనావాసాల్లోనే మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.దీంతో మందుబాబులు ఎగబడి కొనుగోలు చేశారు. పాత రేట్లకే గతంలోని సరకును మద్యం దుకాణాదారులు విక్రయాలు జరిపారు. కొత్త రేట్ల ప్రకారం సరకు అందించేందుకు ఇంకా సమయం పడుతుందని తెలపడంతో కొందరు మద్యం ప్రియులు ఉసూరుమన్నారు. సర్పవరంలో గతంలో ప్రభుత్వ దుకాణం నిర్వహించిన చోట ఒక మద్యం షాపు ఏర్పాటు చేయగా దానికి పక్కనే కొవ్వాడలో కేటాయించిన మద్యం షాపును పోటాపోటీగా ఏర్పాటు చేశారు. దీంతో రెండు దుకాణాల వద్ద శిబిరాలు వేసి మద్యం విక్రయాలు జరిపారు. అక్కడే మద్యం ప్రియులు చుక్కేసి చిందులేశారు.

వెన్నెముక వ్యాధులపై అవగాహన

కాకినాడ రూరల్: ప్రపంచ వ్యాప్తంగా సుమారు వంద కోట్ల మంది వెన్నెముక సమస్యతో బాధ పడుతున్నారని ఎముకలు, కీళ్ల వైద్యనిపుణుడు డాక్టర్ చందు లింగోలు పేర్కొన్నారు. సరైన భంగిమ, క్రమం తప్పకుండా వ్యాయామం, సరైన ఆహారం, సమయానికి నిద్రపోవడం ద్వారా వెన్నెముక సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చని అన్నారు. ప్రపంచ వెన్నెముక దినోత్సవం సందర్భంగా పలు చోట్ల అవగాహన సదస్సులు, వైద్య శిబిరాలను బుధవారం నిర్వహించారు. అచ్చంపేట జంక్షన్ వద్ద మెడికవర్ ఆస్పత్రిలో జరిగిన అవగాహన సదస్సులో డాక్టరు చందు లింగోలు మాట్లాడుతూ ధూమపానం, స్టెరాయిడ్స్ తీసుకోవడం ఎముకలకు హానికరమన్నారు. వ్యాయామం, బలమైన ఆహారంతో వెన్నెముక వ్యాధులు నివారించవచ్చని తెలిపారు. కాకినాడ మెడికవర్ ఆస్పత్రిలో ఎండోస్కోపిక్ స్పైన్ సర్జరీ అందుబాటులో ఉందన్నారు.

ఎముకలు మెత్తబడితే రోగాలు

ఎముకలు మెత్తబడితే రోగాలు వచ్చే అవకాశం ఉందని పీఎంపీ వైద్యుడు కుమార యాదవ్ పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అధిక బరువు, ప్రయాణాలు, ఎక్కువగా శారీరక శ్రమ చేయడం, దురలవాట్లు, కంప్యూటర్ వద్ద గంటల తరబడి పనిచేయం వలన వెన్నెముక సంబంధిత వ్యాధులు వస్తాయన్నారు. కాల్షియం ఎక్కువగా లభించే ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు.

ఘనంగా వరల్డ్ అనస్థీషియా డే



హెచ్‌వోడీ విష్ణువర్ధన్‌కు సత్కారం

కాకినాడ క్రైం: డిపార్ట్‌మెంట్ ఆఫ్ అనస్థీషియా ఆర్ఎంసీ కాకినాడ, కాకినాడ సొసైటీ ఆఫ్ అనస్థీషియాలజిస్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నగరంలో వివిధ కార్యక్రమాలు జరిగాయి. ఉదయం వివేకానంద పార్కు ఆవరణలో మత్తు వైద్య ప్రాధాన్యాన్ని వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం ఆర్ఎంసీ డిజిటల్ లైబ్రరీలో అనస్థీషియా నిపుణులు కామేశ్వరరావు, చక్రరావులను ఆర్ఎంసీ అనస్థీషియా విభాగం ఘనంగా సత్కరించింది. జీజీహెచ్‌లోని అనస్థీషియా హెచ్‌వోడీ ప్రొఫెసర్లను అసోసియేట్, అసిస్టెంట్ వైద్యులు సత్కరించారు. స్కిల్ ల్యాబ్‌లో పోలీసులకు సీపీఆర్‌పై శిక్షణ ఇచ్చారు. సాయంత్రం కాకినాడలోని ఐఎంఏ హాల్లో వర్క్ ఫోర్స్–వెల్ బీయింగ్ అంశంపై సీఎంఈ నిర్వహించారు.

విద్యుత్తు సరఫరాకు ఆటంకం

కాకినాడ సిటీ: ఈనెల 18న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డైరీ ఫారం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కాకినాడ విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్ ఉదయ్‌భాస్కర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వర్ణాంధ్ర కాలనీ, గణేష్ కాలనీ, టిట్‌కో అపార్టుమెంట్స్ ప్రాంతాల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

అన్నమ్మ ఘాట్ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో..

ఈనెల 18న ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అన్నమ్మ ఘాట్ విద్యుత్ ఉపకేంద్రం, తారకరామనగర్ ఫీడర్, ఏటిమొగ విద్యుత్ లైన్లపై పడిన చెట్ల కొమ్మలను తొలగించేందుకు విద్యుత్ సరఫరా నిలుపుతున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ ఉదయ్‌భాస్కర్ తెలిపారు. తారకరామనగర్ ఫీడర్ పరిధిలోగల తారకరామానగర్, ప్రసాదరావు నగర్, మణికంఠ నగర్, సత్యదేవనగర్, కొవ్వూరు రోడ్, నాగరాజుపేట, పరదేశమ్మపేట, పురంవారి వీధి, రిక్షాలపేట, పప్పుల మిల్ ఏరియాల్లోనూ, ఏటిమొగ ఫీడర్ పరిధిలో గల ఏటిమొగ, బోట్‌యార్డ్, చర్చి స్క్వేర్, రెవెన్యూ కాలనీ, కోటిస్తంభం పేట, గోలీలపేట, వలందపేట, కెనాల్‌రోడ్ ఏరియాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాకినాడ రూరల్: కాకినాడ డి 4 సెక్షన్ పరిధిలో శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని విద్యుత్ శాఖ ఈఈ ఉదయ భాస్కర్ కోరారు. 33/11 కేవీ శశికాంత్ నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని వార్షిక మరమ్మతులు చేపడుతున్నట్టు తెలిపారు. 11కేవీ ఆర్టీఓ ఫీడర్‌పై గల రమణయ్యపేట ఏరియా పరిధిలోని లక్ష్మీగణపతి ఏరియా, హెచ్‌పీ గ్యాస్ కంపెనీ గొడౌన్ ఏరియా, తోట సుబ్బారావునగర్ రోడ్ నంబరు 1, 2, ఆశ్రమం స్కూల్ ఎదురుగా, బోట్‌క్లబ్ వెనుక, విద్యానగర్‌లో సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

సీఎం సహాయ నిధికి విరాళం



సీఎం చంద్రబాబుకు రూ.8 లక్షల డీడీని అందజేస్తున్న సంఘ రాష్ట్ర ప్రతినిధులు

సామర్లకోట: తుఫాన్ బాధితులను ఆదుకోవడానికి తమ వంతు సాయంగా రాష్ట్ర దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం తరపున రూ.8 లక్షలు విరాళాన్ని ముఖ్యమంత్రి సహాయనిధికి అందజేసినట్లు సంఘ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ ఎం సీతాపతిరావు తెలిపారు. బుధవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని దస్తావేజు లేఖర్లు అంతా కలిసి సమకూర్చిన ఈ విరాళాన్ని సీఎం సహాయ నిధికి డీడీ రూపంలో అందజేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పీవీ సుబ్బారావు, గౌరవ అధ్యక్షుడు జీఎస్‌వీ సుబ్బారావు, సలహా దారుడు బీజే ప్రసాద్, కోశాధికారి ఏ సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ గాదె రవికుమార్‌లు పాల్గొన్నారు. విరాళాలు అందజేసిన లేఖర్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు



సామర్లకోట: స్థానిక కాకినాడ రోడ్డులోని ముత్యాలమ్మ ఆలయ సమీపంలో బుధవారం స్కూటీపై నుంచి జారి పడి ఒక మహిళ తీవ్రంగా గాయపడింది. కాకినాడ నుంచి స్కూటీపై మహిళ వస్తున్న సమయంలో ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించే క్రమంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ముత్యాలమ్మ ఆలయ సమీపంలో రోడ్డు బురదమయంగా మారింది. దీంతో ఈ ప్రాంతంలో ప్రయాణించే వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అదే రోడ్డులో వెళుతున్న రంగరాయ మెడికల్ కళాశాల విద్యార్థులు స్కూటీపై జారిపడిన మహిళను గుర్తించి ప్రాథమిక చికిత్స చేశారు. విద్యార్థులు ఆమె స్కూటీపై ఆస్పత్రికి తీసుకువెళ్లారు.